క్లుప్తంగా

మాతాశిశు ఆరోగ్య సేవలపై అవగాహన

కె.కోటపాడు: గ్రామాల్లో గర్భిణులకు మాతా శిశుఆరోగ్య సేవలపై ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని వైద్యాధికారి నిర్మల తెలిపారు. మంగళవారం చౌడువాడ పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కిల్‌కారి మొబైల్ సేవలందిస్తున్నట్లు తెలిపారు. 0124458000 నంబర్ వాయిస్ కాల్ ద్వారా గర్భిణులు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకోవచ్చన్నారు. ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

పాచిలవానిపాలెంలో 169 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా మంగళవారం పాచిలవానిపాలెంలో వైద్య సేవలందించారు. వైద్యాధికారులు సుబ్రహ్మణ్యం, తిలక్ 169 మంది రోగులను పరీక్షించారు. అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి ఆరుగురికి వైద్యం అందించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 42 మందికి ఆప్తాలమిస్టు నవీన్ కంటి పరీక్షలు చేశారు. ఎంపీహెచ్ఇవో కె.వి.రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ రాము, రమణ పాల్గొన్నారు.

కొత్తకోటలో రీసర్వే ప్రారంభం

రావికమతం: కొత్తకోటలో సమగ్ర భూ రీసర్వేను సర్పంచ్, ఉప సర్పంచ్ కోన లోవరాజు, పందల దేవా, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, తహసీల్దార్ మహేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. రైతులకు ముందస్తుగా సమాచారం అందిస్తామని, భూమి పత్రాలతో హాజరై సహకరించాలని తహసీల్దార్ ఈ సందర్భంగా సూచించారు. కార్యదర్శి కృష్ణమోహన్, నాయకులు శీలం శంకర్రావు, గుమ్ముడు దొరబాబు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



ఎంపీపీని సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలన్నారు. ప్రజలకు వైద్యం చేరువ చేసేందుకే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అనంతరం ఎంపీపీని సీహెచ్‌వో రమేష్, సిబ్బంది సత్కరించారు.

జంపెనలో ఏకాహం



భజన చేస్తున్న భక్తులు

మాడుగుల: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గురువమ్మ వానపల్లి ధర్మారావు ఆధ్వర్యంలో జంపెన రామాలయంలో ఏకాహం నిర్వహించారు. ఇక్కడ సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు వంద మంది మహిళలు ఉపవాసాలతో హరేరామ హరే కృష్ణ హరేహరే సంకీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ నేమాల గురువునాయుడు పాల్గొన్నారు.

రూ.22 లక్షలతో ఆర్బీకే పనులు



భూమి పూజ చేస్తున్న సర్పంచ్

రోలుగుంట: బి.బి.పట్నంలో ఆర్బీకే నిర్మాణానికి సర్పంచ్ విశ్వేశ్వర్రావు భూమి పూజ చేసి మంగళవారం పనులు ప్రారంభించారు. దీని నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరయ్యాయన్నారు. స్థానికంగానే వ్యవసాయ సేవలందుతాయన్నారు.

సచివాలయ కన్వీనర్ల సమావేశం నేడు

చీడికాడ/మాడుగుల: చీడికాడ తులసీ కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. మాడుగుల బసవ పరమేశ్వరావు గోదాంలో సాయంత్రం 3 గంటలకు ఇదే సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల నగదు పెంపు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నీలకంఠాపురంలో వృద్ధుడికి పింఛన్ నగదు అందిస్తున్న వలంటీరు దేవీప్రసాద్



నర్సీపట్నం: లబ్ధిదారుకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా పింఛన్ల నగదు పెంచి అందిస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని 151 మందికి కొత్త పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 1,360 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌ను వచ్చే ఏడాది జనవరికి రూ.3 వేలు చేస్తామన్నారు. నియోజకవర్గంలో 90 దేవాలయాల నిర్మాణానికి టీటీడీ ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేసిందన్నారు. నర్సీపట్నం-20, గొలుగొండ-20, మాకవరపాలెం-22, నాతవరంలో-28 ఆలయాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, ఎంపీడీవో మాధవి, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, ఎంపీటీసీ బోళెం వెంకటేష్, సర్పంచ్‌లు నారాయణమ్మ, శానాపతి వెంకటరత్నం, బంటు నాగరాజు, నారాయణమ్మ, శెట్టి అచ్చిరాజు, పెట్ల సత్యవతి, సుర్ల శేఖర్, కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు పాల్గొన్నారు.

348 మందికి కొత్త పింఛన్లు

మాకవరపాలెం: మండలంలో 348 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఆయన పింఛన్ల నగదు పంపిణీ చేశారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, వైస్ ఎంపీపీలు రాజారావు, లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భద్రాచలం, గోవిందరావు, హరిబాబు, ఎంపీడీవో అరుణశ్రీ పాల్గొన్నారు.



రావికమతం: కవగుంటలో పింఛన్ అందిస్తున్న సర్పంచ్ దాసరి వరహాలు సూర్యకుమారి

రావికమతం: పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం గ్రామ గ్రామాన ఉత్సాహంగా కొనసాగింది. ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ తలారి రమణమ్మ, మండల ఆగ్రోఅడ్వైజరీ కమిటీ చైర్మన్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, చోడవరం ఏఎంసీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, డైరెక్టర్ ఆధికారి రాజు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి పింఛన్లు పంపిణీ చేశారు.

కొత్తగా 11 మందికి పింఛన్ల పంపిణీ



కె.కోటపాడు: కింతాడలో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ ఈశ్వరమ్మ

కె.కోటపాడు: కింతాడ గ్రామ సచివాలయంలో కొత్తగా 11 మందికి పింఛన్లను సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ మంగళవారం పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ పల్లా కన్నమ్మ, కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: అయితంపూడిలో సర్పంచ్ పెద్దాడ నాయుడు, నాయకులు ఐయితరెడ్డి చినబాబు, వెంకటరావు తదితర్లు కొత్త పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నీలకంఠాపురంలో పెరిగిన పింఛన్ నగదును సర్పంచ్ పడాల నాగభూషణం, కన్వీనర్ మల్లునాయుడు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అందించారు. బుచ్చెయ్యపేట మండలానికి కొత్తగా 319 పింఛన్లు మంజూరయ్యాయి.

సిబ్బంది లేకపోవడంపై తహసీల్దారు అసహనం



డిజిటల్ అసిస్టెంట్ హేమలతతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్రావు

రోలుగుంట: మండలంలోని కుసుర్లపూడి, జానకీ రాంపురం గ్రామ సచివాలయాలను తహసీల్దార్ కె.వెంకటేశ్వర్రావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం కొమరవోలు సచివాలయాన్ని సందర్శించిన సమయంలో డిజిటల్ అసిస్టెంట్ మినహా ఎవరూ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మిగిలిన శాఖల ఉద్యోగులు ఎందుకు లేరని ప్రశ్నించారు. దాంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్ గృహ నిర్మాణాల పరిశీలనకు, గ్రామస్థాయి వ్యవసాయశాఖాధికారి పొలాలకు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి చిరంజీవి నిండుగొండ గ్రామసభకు వెళ్లారని ఆమె వివరించింది. తర్వాత వారికి ఫోన్ చేసి విధులకు హాజరైనట్టు తహసీల్దార్ నిర్ధారించుకున్నారు.

రూ.18 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

చీడికాడ: జేబీపురంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు మంగళవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తమ పంచాయతీకి కేటాయించిన రూ.10 లక్షలతోపాటు మరో రూ. 8 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, వైస్ ఎంపీపీ ధరిశెట్టి స్వాతికొండబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ. 1.50 కోట్లతో దేవరాపల్లి-మారేపల్లి తారురోడ్డు

నిర్మాణ పనులకు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భూమిపూజ



భూమి చేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి, డాక్టర్ నాయుడు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో మండలంలో లింక్ రోడ్లు రూపురేఖలు మారుతున్నాయని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు దేవరాపల్లి-మారేపల్లి తారు రోడ్డు నిర్మాణ పనులకు కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడుతో కలిసి ఆమె మంగళవారం దేవరాపల్లిలో భూమిపూజ చేశారు. రూ. 1.50 కోట్లతో 2.7 కి.మీ మేర తారురోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వార్డు మెంబర్ వేచలపు అప్పలనాయుడు, వాలేటి నాగరాజు, గుల్లేపల్లి మురళీ, చలుమూరి చంద్ర మోహన్, సబ్బవరపు మాలిబాబు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనతో అభివృద్ధి



మాట్లాడుతున్న గొంప జమీలు

నాతవరం: అంటరానితనం నిర్మూలనతో సమాజం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు గొంప జమీలు తెలిపారు. సర్పంచ్ ఎం.వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం గొలుగొండపేటలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జమీలు మాట్లాడుతూ రాజ్యాంగంలో అన్ని వర్గాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం కల్పించారన్నారు. ఆయా వర్గాల వారికి హక్కులను కల్పించడంతోపాటు కాపాడేలా అధికారులు చర్యలను తీసుకోవాలని కోరారు. ఏఎస్ఐ విజయ్‌కుమార్, ఎంపీటీసీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, చినపేట సర్పంచ్ రాజు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



గొలుగొండ: గ్రామసభ జరుగుతున్న దృశ్యం



రోలుగుంట: పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ సంధ్య

మాడుగుల/మాడుగుల రూరల్: గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని, ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇస్తున్నారని జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజరామ్ అన్నారు. సర్పంచ్ గనుతూరు ధార మల్లేశ్వరిచిన్ని అధ్యక్షతన మంగళవారం జాలంపల్లి గ్రామసభ నిర్వహించారు. కొత్తగా మంజూరైన పది మందికి పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బోర అప్పలనాయుడు(చిన్న), సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: గ్రామ పంచాయతీలో తాగునీటి, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కసిపల్లి అప్పారావు, కార్యదర్శి రమణ తెలిపారు. మంగళవారం గొలుగొండ గ్రామసభకు వార్డు మెంబర్లు, అధికారులు, గ్రామస్తులు హాజరయ్యారు. పంచాయతీ అభివృద్ధికి అధికారులు, ప్రజలు సహకరించాలన్నారు.

రోలుగుంట: సర్పంచ్ శెట్టి సంధ్య అధ్యక్షతన నిండుగొండ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చిరంజీవి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం రూ 2,750 పింఛన్లు లబ్ధిదారులకు సర్పంచ్ పంపిణీ చేశారు. తర్వాత వీధుల వారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీటిని ఆయా శాఖల అధికారులతో పరిష్కరిస్తామన్నారు.

లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలతో ఎద్దు మృతి



నాగయ్యపేటలో లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలతో చనిపోయిన దుక్కిటెద్దు

దేవరాపల్లి: లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలతో తన ఎద్దు మంగళవారం మృతి చెందినట్టు మండలంలోని నాగయ్యపేట గ్రామానికి చెందిన బీల వెంకటరావు తెలిపారు. తన రెండు దుక్కుటెద్దులకు పది రోజుల కిందట శరీరమంతటా కురుపులు వచ్చాయని, ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి, సిబ్బంది వైద్య సేవలందించడంతో తగ్గుముఖం పట్టాయని చెప్పారు. మళ్లీ రెండు రోజులుగా పుండ్లు ఎక్కువయ్యాయని, వీటిలో ఒక ఎద్దుకు మంగళవారం మృతి చెందిందని తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ. 50 వేలు వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇదే విషయాన్ని ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజుషారాణి వద్ద ప్రస్తావించగా శ్వాస సంబంధిత సమస్యతో ఎద్దు చనిపోయినట్టు ప్రాథమికంగా నిర్ధారించినట్టు ఆమె చెప్పారు.

డిజిటల్ విద్యకు ప్రభుత్వం శ్రీకారం



ట్యాబ్‌లు పొందిన విద్యార్థినులతో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: విద్యా విధానంలో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులను తీసుకువస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. స్థానిక బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ విద్య బోధన అమల్లోకి వచ్చిందన్నారు. ప్రిన్సిపాల్ ఎల్.సునీత, వైస్ శైలజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



చోద్యం హైస్కూల్లో ట్యాబ్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ, ఉపాధ్యాయులు

గొలుగొండ: చోద్యం జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి(ఆదినారాయణ), వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పుత్తడిగైరంపేట, లింగంపేట, గాదంపాలెం సర్పంచ్‌లు పత్తి రమణ, తోకల సంతోష్, నల్లబెల్లి శ్రీనివాసరావు, హెచ్‌ఎం రత్నాజీ, నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

మాడుగుల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డికి ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ సవాల్



గాదిరాయిలో భూ హక్కు పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ

మాడుగుల రూరల్: కోట్లాది రూపాయలతో మాడుగుల మండలాన్ని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అభివృద్ధి చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే రామానాయుడుకు కనిపించలేదా అని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్ ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే సోమవారం చేపట్టిన పాదయాత్రలో ప్రభుత్వంపై, డిప్యూటీ సీఎంపై చేసిన విమర్శలను వారు తిప్పికొట్టారు. మంగళవారం గాదిరాయిలో మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల నేడు రోడ్లకు ఈ దుస్థితి వచ్చిందన్నారు. మాడుగులలో టీడీపీ నేతలకు, కార్యకర్తలకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఎక్కడైనా పింఛన్లు తొలగించినట్లు నిరూపించగలరా అని ప్రశ్నించారు. మాడుగుల అభివృద్ధి గురించి చర్చించడానికి స్థలం, తేదీ, వేదిక చెబితే తాము వస్తామన్నారు. లేదంటే తాము చెప్పిన స్థలానికి రావాలని సవాల్ విసిరారు.

జగనన్న శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ

మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ మంగళవారం భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. తొలి విడతగా వి.వి.అగ్రహారంలో 120, జి. అగ్రహారంలో 202, జంపెనలో 119, గాదిరాయిలో 208, వీజేపురం 207 పత్రాలను అందజేశారు. ఎంపీడీవో మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పర్రె రామునాయుడు, వీఆర్వోలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్త్రీల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే కృషి



ఉపాధ్యాయిని శాంతమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దేవరాపల్లి: తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే ఆడబిడ్డల చదువుల కోసం అలుపెరగని పోరాటం చేశారని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి ఘన నివాళులర్పించారు. ఎంఈవో సిహెచ్. రవీంద్ర బాబు మాట్లాడారు. హెచ్‌ఎం సిహెచ్. రామా రావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు, కె.వి.రమణ, వార్డు మెంబర్ కాటపల్లి సృజన, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: స్థానిక హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలను వేసి ఉపాధ్యాయులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఓ.ఎస్.శర్మ నివాళులర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయిని వి.శాంతమ్మకు జ్ఞాపిక అందించి దుశ్శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు బోకం ఎర్రునాయుడు, మల్లాది కామేశ్వరరావు, మురళీకృష్ణ, శ్రీరామ్మూర్తి, ఈశ్వరరావు, నరేన్, పీఈటీ జ్యోతి పాల్గొన్నారు.

67 మంది ఉపాధ్యాయినులకు సన్మానం : స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఎంఈవో టి.మధుమూర్తి ఘన నివాళులర్పించారు. అనంతరం మండలంలోని 67 మంది ఉపాధ్యాయినులను సన్మానించారు. ఉపాధ్యాయులు సూర్రెడ్డి శ్రీనివాసరావు, బండారు పేరు నాయుడు, పోతల నాయుడు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: మహిళల విద్యకు పెద్దపీట వేసి ప్రోత్సహించిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.వసంత అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటాన్ని ఆవిష్కరించి అంజలి ఘటించారు. విద్యార్థినులతో జాతీయ గీతాలాపన చేయించారు.

ఘనంగా సారె ఊరేగింపు



సారె ఊరేగింపులో మహిళలు

రావికమతం: స్థానిక శివాలయంలో సోమవారం రాత్రి వేంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం సారె సమర్పించారు. తొలుత ఇంటింటి నుంచి ఒక రకం మిఠాయి చొప్పున పలువురు మహిళలు పళ్లాల్లో తీసుకొచ్చారు. మేళతాళాలు, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని స్వామివారికి సమర్పించారు. పద్మావతి కళామండలి సభ్యులు కోలాటం ఆకట్టుకుంది.

ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి

నాతవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతమయ్యేలా సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రతీ వారం నిర్మాణాల పురోగతిని వివరించాలన్నారు. జేఈ జోగారావు, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.